మినీ కథ

# సగపాలు

## మన్నెం సరస్వతి



అద్దం ముందున్న వివేకానంద తెగ హడావుడి పడిపోతున్నాడు. అప్పుడే స్నానం చేసొచ్చాడు. భుజం మీదుగా టవల్. తడి పొడిగా ఉన్న నుదుటి మీద క్రాఫ్ ముందు అతుక్కుపోయి ఉన్నాయి.

ఈలవేస్తూ హడావుడిగా డ్రెస్సింగ్ టేబుల్ ముందు నాలుగు సార్లు తిరిగాడు. "ఏవోయ్ హలో..ఎక్కడా.." అంటూ శ్రీమతిని ఊదరగొట్టేశాడు కూడా. చివరి పిలుపుతో విసుగ్గా వచ్చిందియిల్లాలు బృంద. "ఏంటండీ హడావుడీ.. మీ డ్రెస్.. అదుగో టీపాయ్ మీదుంది. ఇంకేం కావాలో.." అంటూ.

"డ్రెస్ పెట్టేస్తే.. అయిందా.. మిగతా అన్నీ ఎవరూ చూస్తారుటా.. ఇంకేం పన్లేదా.. కాస్త కాఫీ అన్నా ఇద్దామని లేదు.." చిరాగ్గా అన్నాడు వివేకానంద. "కాఫీ ఫ్లాస్క్‌లో పెట్టానండీ.. నాకూ టైమయిపోతోంది.. వంట పూర్తయింది. నేనూ ఓ పది నిముషాల్లో రెడీ కావాలి. త్వరగా డ్రెసప్ అయి ఆ కాఫీ కాస్త రెండు కప్పుల్లో పోసేసేలోగా నేనూ రెడీ అయి వచ్చేస్తా" అంటూ లోపలికి పారిపోయింది బృంద.

అసహనంగా అటువేపోసారి చూసి తన పన్లో మునిగిపోయాడు వివేకానంద.

బృంద పని ముగించుకొచ్చేసరికి డ్రెస్సింగ్ టేబుల్ ముందు టై సవరించుకుంటున్నాడు వివేకానంద. వెనక భార్య రాకను గమనించనట్టే ఉండిపోయాడు.

'చాల్లెండీ షోకు..' అంది బృంద నవ్వుతూ

"ఉత్త షోకేనా.. అందం లేదనేగా నీ ఉద్దేశం" ఉడుక్కుంటున్నట్లన్నాడు వివేకానంద.

"లేదన్నానా..అదొక్కటే చాలా.." తగ్గకుండా అంది బృంద.

"అంటే సంస్కారం లేదనేనా..?" ఈసారి కొంచెం తీవ్రంగా అన్నాడు వివేకానంద.

"బావుంది ఒకటి వుంటే రెండోదిలేదనేనా.. అందునా. తమరు సంస్కారవాదులు కదా.. అందునా స్త్రీజనోద్ధారకులు.." సరదాగానే అన్నా. ఆమె మాటలో అతనికి అడ్మిరేషన్ విన్పించింది.

* * *

"ఏంటోయ్ వివేక్! ఏంటంత తొందరపడిపోతున్నావ్.." అడిగాడు కొలీగ్ సీతారాం గబగబ సర్దేసి బయటపడే ప్రయత్నంలో ఉన్న వివేకానందని.

"అవునోయ్.. వెళ్ళాలి.. ఈరోజు మా మిసెస్ వచ్చేసరికి లేటవుతుంది.. మా అత్తగారు, బావ మరుదులు వస్తారట.. తనూ.. వాళ్లొచ్చేలోగా.."

"ఇంటి పనీ... వంట పనీ నువ్వే చేస్తావేంటీ.." కవ్వింపుగా అడిగాడు సీతారాం.

"చేస్తే తప్పేంటీ.. ఇంటి పనీ, వంట పనీ.. ఆడాళ్ళే చేసి తీరాలా.. అలాటి బూజుపట్టిన ఆలోచన్లు నాకు చాలా చిరాకు.. నా దృష్టిలో మాత్రం ఆడా మగా ఇద్దరూ సమానమే. ఆ మాట కొస్తే.. ఆడవాళ్ళే ఇంకా గొప్ప.. ఇంటా బయటా కూడా శ్రమ పడతారు" అన్నాడు తన ఫైల్స్ లోపల సర్దేసి రాక్ లాక్ చేస్తూ.

"భలే వాడివే నేనేం కాదన్లేదులేవోయ్.. వెళ్ళు బాబూ.." అంటూ తేలిగ్గా నవ్వేశాడు సీతారాం. అప్పుడే పని పూర్తిచేసుకొచ్చిన స్టెనో రమ.. వివేకానంద మాటలు విని బోలెడు ముచ్చట పడిపోయింది కూడా.

* * *

"ఏమండీ.. మీ మేటర్ అంతా టైప్ చెయ్యడం పూర్తయింది. రాత్రంతా వర్క్ చేశాను. ఇప్పటిదాకా చేశాను. అంతా చేశాను. కొంచెమున్నా. మెచ్చుకోరే.." ఉదయం ఏడు గంటల వేళ టైప్ చేసిన పేపర్స్ సర్దుతూ.. అంది బృంద.

పక్కనే పేపర్ చూస్తూ కూర్చున్న వివేకానంద తలెత్తి చూశాడు "ఇందులో మెచ్చుకునేందుకేముందీ.. నాలో సగపాలు నువ్వు కనక చేశావ్.. ఏం గొప్పని.." అన్నాడు కాజువల్‌గా.

చిన్నబుచ్చుకున్న బృంద లోపలికెళ్ళి మళ్ళీ ఓ అయిదు నిముషాల్లో వచ్చింది.

'ఏమండీ.. పాలొచ్చాయి. స్టవ్ మీద పెట్టాను. నాకు చిన్న అర్జంటు పనుంది.. ఓ అయిదు నిముషాలు.. ఓ మాటు చూస్తుండండీ.. ప్లీజ్.."

పేపర్లో తలదూర్చి వినలేదనుకున్న బృంద మరోసారి హెచ్చరించి మరీ బాత్‌రూమ్‌లోకి పరిగెత్తింది.

ఓ అయిదు నిముషాలు తిరక్కుండానే.. 'ఓయ్.. ఎక్కడున్నావ్.. ఓసారి అర్జంటుగా రా.." ఇల్లెగిరిపోయేలా అరుస్తున్న వివేకానంద కేకలకి హడలిపోతూ పరిగెత్తుకొచ్చింది బృంద 'ఏమయిందీ' అంటూ.

"ఒళ్ళు తెలియకపోతేసరి.. ఏమయిందంట.. ఎక్కడికి పోతే అక్కడే. అటూ చూడోసారి.." అనడంతో వెనక్కి తిరిగి చూసి అవాక్కయింది.

తాను అంతగా చెప్పి స్టవ్ మీద పెట్టిన పాలు మరిగి.. మరిగి.. తెరలు తెరలుగా పొంగిపోతూ..

ఇంకా వివేకానంద అరుస్తూనేవున్నాడు.



### వేయి కళ్ళు

"మమ్మీ ఈ ప్రేమ లేఖ చివర 'వేయి కళ్ళతో ఎదురుచూసే నీ శేఖర్' అని రాశాడు దీనర్థం ఏమిటి?" అని గీత అడిగింది.

"నాకు తెలియదమ్మా.. ఐనా అన్ని కళ్ళున్నవాడిని ఎలా ప్రేమించావే? బుద్ధిలేకపోతేసరి" కేకలేసింది గీతా మమ్మీ..

డా. వేసారపు మాధవయ్య